క్లుప్తంగా

సదాచార వ్రతం ధనుర్మాసం



తులసీ దళాలతో శ్రీకృష్ణుడు

బోట్‌క్లబ్: మహావిష్ణు అవతారమైన శ్రీకృష్ణున్ని పూజించడం ద్వాపర యుగం నుంచి వస్తున్న సదాచారమని భోగిగణపతి పీఠం వ్యవస్థాపకుడు దూసర్లపూడి రమణరాజు అన్నారు. సోమవారం పీఠం ప్రాంగణంలో శ్రీకృష్ణ విగ్రహ కలశస్థాపన, సహస్రతులసీ దళాలతో పూజా కార్యక్రమం నిర్వహించారు. జనవరి ఒకటిన సాయంత్రం ఐదుకు సముద్రునికి విష్ణుహారతి ఇస్తామన్నారు. ధనుర్మాసంలో నిర్వహించే సముద్రస్నానం అశ్వమేధయాగ ఫలితమిస్తుందన్నారు.

ఓటు హక్కుపై రేపు బైక్ ర్యాలీ

కాకినాడ: సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ ప్రోగ్రాం(స్వీప్)లో భాగంగా ఈ నెల 20న కాకినాడలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు చెప్పారు. బుధవారం ఉదయం తొమ్మిది గంటలకు కాకినాడ వివేకానంద పార్కు నుంచి ఇంద్రపాలెం అంబేడ్కర్ విగ్రహం, కలెక్టరేట్, మసీద్ సెంటర్, జగన్నాథపురం, మున్సిఫ్ జంక్షన్, నరసింహ రోడ్ ఎన్టీఆర్ వారధి, వన్ టౌన్ పోలీస్ స్టేషన్, సినిమా రోడ్డు, భానుగుడి మీదుగా మిలటరీ రోడ్డులోని శారదా దేవి ఆలయం వద్దనున్న నగరపాలక సంస్థ కార్యాలయం వరకు ఈ ర్యాలీ కొనసాగుతుందని వివరించారు. సచివాలయ కార్యదర్శులు, బీఎల్ఓలతో ఈ బైక్ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. సంబంధిత ఉద్యోగులు ఈ ర్యాలీలో పాల్గొని, ప్రజల్లో ఓటు హక్కుపై అవగాహన కల్పించాలని కోరారు.

పాలిటెక్నిక్ విద్యార్థులకు ఇంజిన్ అందజేత



పాలిటెక్నిక్ విద్యార్థులకు కట్ సెక్షనల్ ఇంజిన్‌ను అందజేస్తున్న రాజేష్ మిట్టల్

కాకినాడ సిటీ: వికాస ఆధ్వర్యంలో కాకినాడ ఆంధ్రా పాలిటెక్నిక్ కాలేజీలో మెకానికల్ కోర్సు విద్యార్థుల ప్రాక్టికల్స్ కోసం కట్ సెక్షనల్ ఇంజిన్‌ను దాతలు అందజేశారు. వికాస పీడీ కె.లచ్చారావు సమక్షంలో ఇసుజు మోటార్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రెసిడెంట్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ రాజేష్ మిట్టల్, సీపీవో పి.త్రినాథ్ సోమవారం కాలేజీ ప్రిన్సిపాల్ జనార్దనరావుకు దీనిని అందించారు. ఈ సందర్భంగా రాజేష్ మిట్టల్ మాట్లాడుతూ విద్యార్థులు ఆధునాతన సాంకేతికతతో నైపుణ్యాన్ని మెరుగుపరచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ జీఎం కె.వేణుగోపాల్, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యుత్తును పొదుపు చేయాలి

కాకినాడ రూరల్: పొదుపు చేయడం ద్వారా విద్యుత్తును పునరుత్పత్తి చేసిన వారమవుతామని విద్యుత్ శాఖ విశ్రాంత ఎస్ఈ అడ్డాల వీరభద్రరావు అన్నారు. విద్యుత్ పొదుపు వారోత్సవాల్లో భాగంగా సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ వాడకాన్ని తగ్గించడం ద్వారా ఇంధనాన్ని ఆదా చేసినట్టవుతుందన్నారు. ప్రతిఒక్కరూ ఎల్ఈడీ బల్బులు వాడడం ద్వారా విద్యుత్ బిల్లులు తగ్గించుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు డాక్టర్ అడ్డాల సత్యనారాయణ, అడబాల రత్నప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై విస్తృత ప్రచారం

కరప: కేంద్ర పథకాలపై సిరిపురం, జి.భావారం గ్రామాల్లో సోమవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర జరిగింది. ఎంపీడీఓ కె.అప్పారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి 20 రకాల పథకాలు అమలు చేస్తోందని వివరించారు. అర్హత ఉండి, పథకాలు అందని వారు తమ పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు, ఆయుష్మాన్ భవ కార్డులను బీజేపీ నాయకులు, అధికారులు అందజేశారు. సర్పంచ్‌లు నున్న సుజాత, రొక్కాల గణేష్, నున్న వీరబాబు, బీజేపీ మండల అధ్యక్షుడు రెడ్డి రమణేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల ఆందోళన

కాకినాడ సిటీ: అంగన్‌వాడీలకు ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు కోరారు. సోమవారం కాకినాడ కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీ కార్యకర్తల ధర్నాలో ఆయన మాట్లాడారు. సమ్మె ప్రారంభమై ఏడు రోజులైందని, వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీల డిమాండ్లను ప్రస్తావించారు. సీఐటీయూ నాయకులు దడాల పద్మ, చెక్కల రాజ్‌కుమార్, మలకా రమణ, చంద్రావతి పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో పెద్దశివాలయంలోని సుబ్రహ్మణేశ్వరస్వామి



రామారావుపేట శివాలయంలో స్వామి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచిఉన్న భక్తులు



గొర్రిపూడిలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



ఇంద్రపాలెంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి చేస్తున్న అభిషేకం



కరపలోని 51 అడుగుల సుబ్రహ్మణ్య స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

సుబ్రహ్మణ్యేశ్వరా.. పాహిమాం..

- నగరంలో వైభవంగా షష్ఠి వేడుకలు
- ఉదయం నుంచే స్వామివారికి అభిషేకాలు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

బోట్‌క్లబ్: సుబ్రహ్మణేశ్వర షష్ఠి మహోత్సవం సోమవారం నగరంలోని అనేక ఆలయాల్లో వైభవంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచి స్వామి వారికి పంచామృతాభిషేకాలు ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి అభిషేకాలు, పూజలు నిర్వహించేందుకు భక్తులు తరలిరావడంతో సుబ్రహ్మణేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక సంతచెరువు కనకదుర్గ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఉన్న సుబ్రహ్మణేశ్వరస్వామి వారికి వైభవంగా పూజలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్థానిక దేవాలయంవీధిలోని బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయం ప్రాంగణంలో ఉన్న సుబ్రహ్మణేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ రాజేశ్వరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. స్థానిక సంతచెరువుగట్టు వద్ద నున్న నాగేంద్రస్వామి ఆలయంలో భక్తులు స్వామివారి దర్శనానికి క్యూలు కట్టారు. స్థానిక రామారావుపేటలోని అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న సుబ్రహ్మణేశ్వరస్వామి వారికి భక్తులు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. స్థానిక జగన్నాథపురం, సాంబమూర్తినగర్‌లోని శివాలయం ప్రాంగణంలో ఉన్న సుబ్రహ్మణేశ్వరస్వామి వారికి, స్థానిక విద్యుత్‌నగర్ వినాయకుడి గుడి సమీపంలో ఉన్న నాగేంద్రస్వామి వారికి భక్తులు విశేష పూజలు జరిపించారు. స్థానిక రిజర్వులైన్ అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న సుబ్రహ్మణ్య స్వామివారికి కావిడి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఆలయ ఇన్‌చార్జి గోపాలకృష్ణ తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



అన్నమ్మఘాటీలో సుబ్రహ్మణ్య స్వామి భారీ విగ్రహం వద్ద భక్తులు



సంతచెరువు కనదుర్గమ్మ ఆలయంలో క్షీరాభిషేకం



ఇంద్రపాలెంలో షష్ఠి వేడుకలకు హాజరైన భక్త జన సందోహం

అన్నమ్మ ఘాటీ వద్ద..

కాకినాడ సిటీ: కాకినాడ జగన్నాథపురం అన్నమఘాటీ సెంటర్‌లో ఉన్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. సోమవారం తెల్లవారుజాము 3 గంటల నుంచే భక్తులు ఆలయానికి పోటెత్తారు. ఆలయ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన 50 అడుగుల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహానికి భక్తులు పూజలు చేశారు. విశేష పూజలు నిర్వహించిన భక్తులకు ఆలయ కమిటీ వారు ప్రసాదాలను అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ పైలా అన్నపూర్ణ ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించారు.

ఇంద్రపాలెం ఆలయానికి పోటెత్తిన భక్తులు

కాకినాడ రూరల్: సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి వేడుకలు రూరల్ నియోజవర్గంలో సోమవారం ఘనంగా జరిగాయి. ఇంద్రపాలెం గ్రామంలో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచి స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. వేలాదిగా భక్తులు తరలివచ్చారు. భక్తుల కోసం ఆలయం ఎదురుగా లాకుల వద్ద ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆదేశాల మేరకు వంతెనను నిర్మించారు. గ్రామ నాయకుడు గీసాల శ్రీను వంతెనను ప్రారంభించడంతో భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఆలయానికి సుమారు 40 వేల మంది భక్తులు హాజరయ్యారని ఈఓ జోగా సత్యనారాయణ తెలిపారు. తమ్మవరం గ్రామంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి పరిసర గ్రామాల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. పండూరు, తిమ్మాపురం, రమణయ్యపేట ఆర్టీసీ కాలనీలో షష్ఠి వేడుకలు ఘనంగా జరిగాయి.

భక్తిశ్రద్ధలతో షష్ఠి వేడుకలు

కరప: మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మండలంలోని కరప, గొర్రిపూడి, వేళంగి, సిరిపురం గ్రామాల్లోని సుబ్రహ్మణేశ్వరస్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. గొర్రిపూడిలో తుల్యభాగ నదీతీరాన ఉన్న వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని కరప, పరిసర మండలాల భక్తులు దర్శించుకున్నారు. అర్చకులు బాదంపూడి వీరవెంకటసత్యనారాయణ, శివకుమార్ స్వామివారికి పూజాదికాలు నిర్వహించారు. ఆదివారం రాత్రి ఆలయ ధర్మకర్త గండి వెంకట్రాజు, రామాదేవి దంపతులు స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు చీకాల సుబ్బారావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చీకాల అప్పలరాజు, కె.వీరబాబు. సర్పంచ్ కె.రమాదేవి తదితర ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కరపలోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో వంశపారంపర్య ధర్మకర్త చాగంటి వెంకట్రావు కుటుంబ సభ్యులు పూజలు చేశారు. వేళంగిలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆలయంలో స్వామివారికి కల్యాణం జరిగింది. వంశపారంపర్య ధర్మకర్త మెర్ల వీరయ్యచౌదరి ఏర్పాట్లు చేశారు.

51 అడుగుల సుబ్రహ్మణ్యస్వామికి పూజలు

కరప, పెనుగుదురు గ్రామాల మధ్య సిరిపురం గ్రామానికి చెందిన వ్యాపారవేత్త చిక్కాల దొరబాబు, సుబ్బారావు సోదరులు నిర్మించిన 51 అడుగుల వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి విగ్రహం వద్ద కాకినాడ శ్రీపీఠం పరిపూర్ణానంద స్వామి ప్రత్యేక పూజలు చేశారు. ఆగమశాస్త్ర ప్రకారం చిక్కాల దొరబాబు, సావిత్రి దంపతులు, సుబ్బారావు, అనురాధ దంపతులతో వివిధ పూజా కార్యక్రమాలు, హోమం, శాంతికల్యాణం జరిపించారు. ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు, జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, వివిధ పార్టీల నాయకులు స్వామివారిని దర్శించుకున్నారు. మహాన్నదాన కార్యక్రమంలో 18 వేల మంది భక్తులు పాల్గొన్నారు. కాకినాడ రూరల్ సీఐ కె.శ్రీనివాస్, కరప ఎస్సై ఎస్.రామకృష్ణ తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

రూ.73 కోట్లతో సంక్షేమ పథకాల లబ్ధి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి



సూర్యారావుపేటలో పథకాల బోర్డు ఆవిష్కరించిన దృశ్యం



కరప కాలనీలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

- 'వై ఏపీ నీడ్స్ జగన్'లో ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: గడచిన నాలుగున్నరేళ్లలో 17, 18 డివిజన్లలోని సంక్షేమ పథకాల లబ్ధిదారులకు రూ.73 కోట్ల విలువైన లబ్ధిని చేకూర్చామని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి చెప్పారు. స్థానిక 17, 18 డివిజన్లకు సంబంధించి ముత్తానగర్‌లో సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. ప్రభుత్వ సంక్షేమ పథకాల బోర్డును ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ నగరాన్ని అభివృద్ధికి చిరునామాగా తీర్చిదిద్దాలన్నదే లక్ష్యమన్నారు. ఇందులో భాగంగా దాదాపు అన్ని డివిజన్లలో రోడ్లు, డ్రైనేజీలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పన పూర్తయిందన్నారు. పెండింగ్‌లో ఉన్న కొద్దిపాటి పనులను కూడా జనవరి నెలాఖరు నాటికి పూర్తి చేస్తామని చెప్పారు. ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం అవిశ్రాంతంగా శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో కూడా మరోసారి ఆశీర్వదించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కొడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, స్థానిక నాయకులు దోని చిట్టిబాబు, చవ్వాకుల రాంబాబు, వెలమల మల్లేశ్వరరావు, సిద్ధాంతపు రాజు, త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలి

కరప: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ఆశీర్వదించాలని జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి అన్నారు. కరప గ్రామ సచివాలయం-2 పరిధిలో రామకంచిరాజునగర్ కాలనీలో సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. వారు మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబును వచ్చే ఎన్నికల్లో గెలిపించి, తద్వారా జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. సర్పంచ్ సాదే ఆశాజ్యోతి మాట్లాడుతూ డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా రూ 32.85 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని వివరించారు. పథకాల బోర్డును నాయకులు ఆవిష్కరించారు. అనంతరం కాలనీలో వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేశారు. పార్టీ మండల అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, ఉప సర్పంచ్ భోగిరెడ్డి సూర్యనారాయణ, నాయకులు పెంకే సత్తిబాబు, సాదే లోహిదాస్, మద్దూరి భాస్కర్, గ్రామ కార్యదర్శి ఎస్కే నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ఫలాల కోసం జగనే సీఎం కావాలి

కాకినాడ రూరల్: ప్రజలకు సంక్షేమ పథకాలు అందాలంటే ముఖ్యమంత్రిగా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రావాలని జేసీఎస్ మండల కన్వీనరు గీసాల శ్రీనివాసరావు, సూర్యారావుపేట గ్రామ నాయకుడు సూరాడ రాజు అన్నారు. మత్స్యకార గ్రామం సూర్యారావుపేట సచివాలయం-1 పరిధిలో సోమవారం సాయంత్రం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం పంచాయతీ కార్యదర్శి వెంకటరత్నం అధ్యక్షతన జరిగింది. ఈఓ పీఆర్అండ్ఆర్‌డీ రామాంజనేయులు నోడల్ అధికారిగా హాజరయ్యారు. గ్రామంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల కింద సచివాలయం-1 పరిధిలో సుమారు రూ.24 కోట్లు అందించినట్టు వివరించారు. పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. గ్రామసభ అనంతరం గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు పార్టీ జెండాను ఆవిష్కరించారు. శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ అనుసూరి ప్రభాకర్, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆరోగ్యశ్రీతో పేదలకు ధీమా

- రూ.25 లక్షలకు పెరిగిన పథకం పరిమితి

కరప: పేద వర్గాల ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలందించాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నిరకాలా చర్యలు తీసుకుంటున్నారని ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు పేర్కొన్నారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం సోమవారం నుంచే అమలయ్యేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం వైద్యాధికారులు, సిబ్బందితో కలిసి ఎంపీపీ, జెడ్పీటీసీలు ఈ పథకం కరపత్రాలను ఆవిష్కరించారు. పథకం పరిమితిని రూ.25 లక్షలకు పెంచినట్టు, 2,513 ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. గ్రామాల్లో అన్ని వర్గాల ప్రజలకు అవగాహన కల్పించేందుకు వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు విస్తృత ప్రచారం చేయాలన్నారు. మండల వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రీనివాసనాయక్ మాట్లాడుతూ ప్రతి కుటుంబ యజమాని ఫోన్‌లో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ యాప్‌ను డౌన్‌లోడ్ చేయిస్తామని, అర్హులందరికీ ఆరోగ్యశ్రీ కార్డులు అందజేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, నాయకులు పెంకే సత్తిబాబు, కరప, వేళంగి పీహెచ్‌సీ వైద్యులు అంజిలీన్, ఎంకే సౌజన్య, ఈ.సింధూర తదితరులు పాల్గొన్నారు.



కరపలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు, వైద్యులు

పెంపు పేదలకు వరం

కాకినాడ రూరల్: ప్రజలకు మేలు జరిగేలా ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ.25 లక్షలకు పెంచడం పేదలకు వరమని పండూరు ఉప సర్పంచ్ వలవల వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ నందిపాటి వెంకట శ్రీనివాస్ పేర్కొన్నారు. పండూరు ఆర్బీకేలో సోమవారం స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీలో వారు పాల్గొన్నారు. అనంతరం ఇంటింటికీ తిరిగి పథకంపై అవగాహన కల్పించారు. వైఎస్సార్ సీపీ నాయకులు నందిపాటి ధర్మరాజు, ఆది, సొసైటీ అధ్యక్షుడు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నంబర్

- కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు

కాకినాడ: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి డయల్ యువర్ కమిషనర్, స్పందనతో పాటు టోల్ ఫ్రీ నంబర్‌ను కూడా ఏర్పాటు చేసినట్టు కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు తెలిపారు. కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను కమిషనర్ స్వీకరించారు. ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, పారిశుధ్యం, వీధి దీపాలకు సంబంధించి డయల్ యువర్ కమిషనర్‌కు 8, స్పందనకు 14 దరఖాస్తులు వచ్చాయి. వీటిని సత్వరమే పరిష్కరించాల్సిందిగా కమిషనర్ అక్కడున్న అధికారులను ఆదేశించారు. ఆర్థికపరమైన, కోర్టు సంబంధ అంశాలు మినహా మిగిలిన సమస్యలను ఎప్పటికప్పుడు నిర్దేశిత వ్యవధిలో పరిష్కరించి, ఆ విషయాన్ని ఫిర్యాదుదారులకు కూడా తెలియజేయాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వహిస్తే ఏమాత్రం ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ కార్యాలయం వరకూ రాలేని ప్రజలు.. స్థానికంగా ఉండే సచివాలయాల్లో కూడా తమ దరఖాస్తులను అందజేయవచ్చని సూచించారు. కాగా ప్రతిరోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 6 లోపు టోల్ ఫ్రీ నంబర్ 1800-4255 990కు కాల్ చేసి, స్థానికంగా ఎదుర్కొనే సమస్యలను వివరించవచ్చన్నారు. టోల్ ఫ్రీ నంబర్ ప్రతిరోజూ అందుబాటులో ఉంటుందన్నారు టోల్ ఫ్రీ నంబర్‌కు వచ్చే ఫిర్యాదులకు కూడా పూర్తి ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఎస్ఈ పి.సత్య కుమారి, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఈఈలు మాధవి, వెంకటరావు, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, డీసీపీ హరిదాసు, ఏసీపీ నాగశాస్త్రులు, మేనేజర్ సత్యనారాయణ, టీపీఆర్ఓ మానే కృష్ణమోహన్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ నాగనరసింహారావు

వచ్చే ఎన్నికలకు సమాయత్తం కండి

- దుష్ప్రచారాలను తిప్పి కొట్టండి
- వైఎస్సార్ సీపీ విస్తృత సమావేశంలో ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: మార్చిలో జరగనున్న ఎన్నికలకు పార్టీ కేడర్ సమాయత్తం కావాలని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పిలుపునిచ్చారు. అదే సమయంలో టీడీపీ, జనసేన చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పికొట్టాలని కోరారు. స్థానిక డి కన్వెన్షన్‌లో సోమవారం వైఎస్సార్ సీపీ కాకినాడ సిటీ విస్తృత స్థాయి సమావేశం నగర అధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ నవరత్న పథకాల ద్వారా ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ప్రస్తుత ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించుకుంటే, పేద ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని, అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉంటారన్న వాస్తవాన్ని ప్రజలకు తెలియజెప్పాలన్నారు. పార్టీ కోసం కష్టించి పని చేసే ప్రతి కార్యకర్తకు సముచిత గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. త్వరలో జరగనున్న జగనన్న సంక్రాంతి సంబరాలు, ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాల్లో పెద్దఎత్తున యువత, మహిళలను భాగస్వామ్యం చేసి, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాకినాడ సిటీ నియోజకవర్గంలో గడచిన నాలుగున్నరేళ్లలో రూ.1,700 కోట్ల విలువైన సంక్షేమ పథకాలను ప్రజలకు అందించామన్నారు.



నాయకుల సత్కార కార్యక్రమంలో ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి



సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

నేతలకు సత్కారం

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీసెల్, మైనార్టీసెల్, వాణిజ్య విభాగాల రీజనల్ కో-ఆర్డినేటర్లుగా నియమితులైన అల్లి రాజబాబు, అబ్దుల్ బషీరుద్దీన్, పెద్ది రత్నాజీ, రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి బాదం మధును ఎమ్మెల్యే ద్వారంపూడి, పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. సమావేశంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కొడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, మాజీ డిప్యూటీ మేయర్లు చోడిపల్లి ప్రసాద్, మీసాల ఉదయ్, పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

క్రీస్తు బోధనలతో చింతలు దూరం

కరప: ఏసు క్రీస్తు బోధనలు అనుసరిస్తే మనస్సుకు ప్రశాంతత చేకూరి, చింతలన్నీ దూరమవుతాయని సీటీసీ సీఓఎం వ్యవస్థాపక అధ్యక్షుడు బిషప్ డాక్టర్ మార్రెళ్ల విలియమ్స్ అన్నారు. పెద్దాపురప్పాడులో సోమవారం న్యూజియోన్ జీసస్ బాప్టిస్ట్ చర్చి 55వ వార్షికోత్సవం జరిగింది. ఈ సందర్భంగా పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. బిషప్ డాక్టర్ విలియమ్స్ క్యాలెండర్, బిషప్ టి.రత్నకుమారి రూపకల్పన చేసిన వెయ్యి కీర్తనల పుస్తకాన్ని ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీసెల్ ప్రధాన కార్యదర్శి, విలియమ్స్ చారిటబుల్ సొసైటీ డైరెక్టర్, విలియమ్స్ విద్యాసంస్థల చైర్మన్ మార్రెళ్ల స్టీఫెన్, బిషప్ డాక్టర్ టి.రత్నం, రెవ.డాక్టర్ టి.జోయ్‌బాబు, విల్సన్, కాకతీయరాజు, మండల పాస్టర్స్ ఫెలోషిప్ యునైటెడ్ అధ్యక్షుడు ఎం.రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పేదలకు దుప్పట్లు ఇస్తున్న విలియమ్స్

ఫీల్డ్ అసిస్టెంట్ల ధర్నా

కాకినాడ సిటీ: గ్రామీణ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, రూ.10 లక్షలు ప్రమాద బీమా కల్పించాలని, మ్యాన్ డేస్ విధానాన్ని రద్దు చేయాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జాయింట్ కలెక్టర్ ఇలక్కియకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.సత్తిరాజు, మేడిశెట్టి వెంకటరమణ, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటుపై అవగాహన కోసం 21న రంగవల్లుల పోటీలు

కాకినాడ: ఓటుఎ హక్కు వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఈ నెల 21న మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహిస్తున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు తెలిపారు. పోటీలకు సంబంధించిన ఏర్పాట్లను ఆయన సోమవారం నగరపాలక సంస్థ అధికారులతో సమీక్షించారు. కమిషనర్ మాట్లాడుతూ స్థానిక ఆనందభారతి గ్రౌండ్స్‌లో గురువారం మధ్యాహ్నం మూడు గంటలకు ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు మూడు కన్సోలేషన్ బహుమతులు కూడా అందిస్తామన్నారు. ఓటు నమోదు చేసుకోవడం నుంచి ఓటు హక్కు వినియోగం వరకు ప్రజల్లో అవగాహన కల్పించేలా వేసే ఉత్తమ రంగవల్లులను న్యాయనిర్ణేతలు బహుమతులకు ఎంపిక చేస్తారన్నారు. పోటీల్లో పాల్గొనే మహిళలు అవసరమైన రంగులు, ముగ్గులు వారే తెచ్చుకోవాలని స్పష్టం చేశారు. ఆసక్తి ఉన్న మహిళలు ఈ నెల 20న సాయంత్రం ఐదు లోగా తమ పేర్లను నమోదు చేసుకోవచ్చన్నారు. ఇందుకు మొబైల్ నంబర్ 18004255990ను సంప్రదించవచ్చన్నారు. టీపీఆర్ఓ మానే కృష్ణమోహన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.